

# చీకటిచాటు మనిషి

అప్టే పొద్దుపోలేదు. అయినా మహా చీకటిగా వుంది.

చీకటి !

కన్ను పొడుచుకున్నా కనుపించని కారుచీకటి.

అజ్ఞాని మనస్సులా, మూర్ఖుడి ఆలోచనల్లా; అంతా చీకటే !

వెలుగులో జరగని పనులెన్నో చీకట్లో జరిగిపోతూ వుంటాయి. అందుకే చీకటి అజ్ఞానానికి ప్రతీక అంటారు.

అజ్ఞానానికి అవధుల్లేవు.

చీకటికి కళ్లలేవు.

కళ్లున్న అజ్ఞాని - కళ్ళూ కాళ్ళూ చేతులూ వున్న కారుచీకటి !!

చీకటిలో....

చీకటిలాంటి రెండు ఆకారాలు నడుస్తున్నాయి. పంటకాలువ మీది చీకటి చారికలాంటి తాటి వట్టె వంతెన దాటి అవతలి గట్టు వెంబడే

గుట్టుగా నడుస్తున్నాయి. మాటా మంతీ లేదు. మనసులున్నాయో లేదో మరి! మనకు తెలీదు !!

పంటకాలువ పయనం సాఫీగా సాగిపోయింది. వీళ్ల మార్గం మాత్రం మలుపు తిరిగింది. ఆ మలుపుకు మరి కొంచెం దూరంలో పెద్ద మర్రిచెట్టు ఒకటుంది. దాన్ని రాకాసి మర్రంటారంతా. చీకటిని మరింత చిక్కబరుస్తోన్న ఆ మర్రినీడకు వచ్చాయి ఆ ఆకారాలు. అలికిడికి గుడ్లగూబ గోల చేసుకుంటూ ఎగిరిపోయింది గమ్యంతెలీక. గబ్బిలం ముందు ఆకారం ముఖానికి ఢీ కొట్టింది. మరెవ్వరైనా అయితే అదిరిపడి చచ్చే వారే! ఎంచేతనంటే ఆ మర్రిచెట్టు మీద బ్రహ్మరాక్షసి కాపురం వుంటోందని ఆ వూరి వాళ్ల నమ్మకం. ఆ నమ్మకానికి ఆధారంగా గత పంచాయతీ ఎన్నికలకు ముందు అంబాజీ పేట సంతనుంచి తిరిగొస్తున్న అనంతనాయుడు ఆ చెట్టు కిందే రక్తం కక్కుకుని చచ్చిపోయాడు. ఎన్నికల తర్వాత కూడా ఒక మెంబర్ని ఈ బ్రహ్మరాక్షసి బలి తీసుకుందిట! ఇవన్నీ తెలిసివుండే నిర్భయంగా ఆ నీడను దాటుకొని అరటితోటకు అడ్డం పడ్డాయి ఆ ఆకారాలు.

అరటి తోట దాటాక చిక్కని కొబ్బరి తోపు. కొబ్బరి మొక్కలింకా ఎదగలేదు. ఒకదాన్నొకటి అల్లుకుని గూడు కట్టుకుని వున్నాయి. ఆ కొబ్బరి తోపులో గొడ్లకోసం పకడ్బందీగా కట్టిన పెంకుటిశాల వుంది. దాన్నే పెద్దకాపు మకాం అంటారు.

పెద్దకాపు మకాంలో కొబ్బరి చిక్కం వూగుతోంది. దాంట్లో మెత్తటి పాతగడ్డి పరుపుమీద పెద్దకాపు భారీ కాయం వూగుతోంది. అతని మనస్సు కూడ అనేక ఆలోచనల్తో డోలాయమానంగా వుంది. బయట అడుగుల చప్పుడు విని:

'ఎవర్రా ?' అనరిచాడు పెద్దకాపు.

'నేను బాబయ్యా పద్దిగాణ్ని' సమాధానం చెప్పాడు పద్దాలు.

'ఆడొచ్చాడా ?'

'ఒచ్చానండి బాబయ్యా' రెండోవాడి సమాధానం.

పెద్దకాపు చీకట్లోనే సర్దుకొని కూర్చుని, జేబులో చుట్టకోసం కదిపాడు. అగ్గిపెట్టి తగిలింది. గాని చుట్ట దొరకలా!

'పుగాకయిపోయిందిరా పద్దాలూ' అన్నాడు.

'ఎల్తన్నా బాబయ్యా' అని వెంటనే బయటికి నడిచాడుపద్దాలు.

పద్దాలు అటువెళ్లగానే, ఇటు ఇవతలి జేబులోంచి చుట్టతీసి వెలిగించాడు పెద్దకాపు. గబ గబా రెండుగుక్కల పొగలాగాడు. పీల్చినప్పుడు చుట్ట బ్రహ్మరాక్షసి ఒంటి కన్నులా మండింది.

'పానకాలూ... నీతో పని పడిందిరా!' అన్నాడు పెద్దకాపు తాపీగా.

పానకాలు మాట్లాళ్లేదు. పెద్దకాపు పని ఎలాంటిదో పానకాలుకు తెల్సు. అందుల్లోనూ చీకట్లో పెద్దకాపు మకాంకు పిలుపు వచ్చిందంటే, ఇహ అసలే చెప్పనక్కర్లేదు.

'మాట్లాడవేంరా ?' రెట్టించాడు పెద్ద కాపు.

'చిత్తం...' అన్నాడు పానకాలు.

'ఏంటి చిత్తం ?'

'అసువంటి పన్లు మానేశానండి'

'పెద్దకాపు పెద్దగా నవ్వాడు. బ్రహ్మరాక్షసిలా నవ్వాడు. నిర్జనమైన ఆ అజ్ఞాత ప్రదేశంలో, చీకట్లో ... అదో మౌన గర్జన.

'ఉహూం... అయితే గాంధీగారివై పోయావన్నమాట!' అన్నాడు సన్యాసి.

పానకాలు జవాబివ్వలేదు.

'అసలు నువ్వేరా పానకాలూ ఆ మాటంటున్నదీ?'

'అవునండి.'

'అమ్మో... ఏంటిరా నీ ధైర్యం? వూళ్ళో ఉండాలని లేదా?'

'తంవరేం జేశ్నా సరేనండి. అ పాపాలు మాత్రం నానింక సెయ్యనండి. పిల్లలు గలోణ్ని.'

'పిల్లలు గలోడివి కాబట్టే చెప్తున్నానోయ్. ఆలోచించుకో! ఇంతకాలం నిన్ను బయపెట్టో, లేక బస్తా బియ్యానికి బెలిపించో పనులు చెయ్యించుకుంటూ వచ్చాను. కాని ఇప్పుడలా కాదు. పని చేశావో... రెండెకరాలు... ముప్పై వేలు ఖరీదుచేసే రెండెకరాల పొలం రాసేస్తా. నీ పెళ్ళాం పిల్లలు హాయిగా బతకొచ్చు' అని హితబోధ చేశాడు పెద్దకాపు.

పానకాలు ఎప్పుడో ఒక నిశ్చయానికి ఒచ్చేశాడు. ఆరుగురు ఆడపిల్లల తరవాత పుట్టిన ఒక్క కొడుకు చచ్చిపోయినప్పుడే ఆ నిర్ణయానికి వచ్చేశాడు. ఇంక పాపాలు చెయ్యకూడదు. పస్తులుండి అయినా సరే నిజాయితీగా బతకాలి. ఇంతవరకూ చీకటి చాటున బతికాడు. ఇప్పుడు చీకటినుంచి పారిపోయి వెలుగు రేఖలకోసం వెంపర్లాడుతున్నాడు. ఈ మహా ప్రస్థానంలో అడుగడుగునా అవాంతరాలేరానీ, అవరోధాలే కలగనీ, ధైర్యంగా పోవాలి. ముమ్ముందుకు సాగిపోవాలి. అదే వాడి దృఢ నిశ్చయం.

'ఏమంటావో చెప్పుమరి! పని కూడా అంత పెద్దదేంకాదు' అని మళ్ళీ రెచ్చగొట్టాడు పెద్దకాపు.

అదెంత చిన్నపనైనా చెయ్యాలనిలేదు పానకాలుకు. కాని అదే విటో తెల్సుకోవాలనే ప్రలోభం మాత్రం కలిగించి.

'అసలు పనేంటండీ ?' అనడిగాడు.

'అదీ... అలా అడిగావ్, బావుంది. విను చెప్తాను. మన యెర్రోడు లేడూ... అద్దేరా... మా అల్లుడి అన్నగారు. అసలే బూదేవి తొమ్మిదినెల్ల గర్భిణిలా జనంతోటి ఆపసోపాలు పడతావుంటే, ఈ యెదవకి ఇంత కాలానికి పెళ్ళాడాలని బుద్ధి పుట్టింది.'

'పెళ్ళి పెడగొట్టియ్యాలాండి'

'ఏడిశావ్ లేవోయ్ ! ఆ మాత్రం పని నేనెయ్యలేనేంటి ?'

'మరేం సెయ్యాలంటా'

'ఏమీలేదు. చిన్నపనే. చాలా చిన్నపని. ఆడికీమధ్య రొండో ఆట సిన్మాలు మా జోరయినాయి. ఏదో మంచిరోజు చూసి మర్రిచెట్టు కింద తొంగో బెట్టియ్యి' అన్నాడు సునాయాసంగా.

పానకాలు అదిరిపోయాడు. అంతేకాదు. పెద్దకాపు ఆశమీద అసహ్యంకూడా వేసింది. వూరు సగం పెద్దకాపుదే. మిగిలిన సగం ఇంచుమించు అతని అల్లుడిది. అల్లుడికి ఒక్కడే ఒక్క తోబుట్టువు. అతణ్ని వెర్రినాగన్న అంటారంతా. అందుకే ఎవ్వరూ పిల్లని ఇవ్వక ఇంతవరకూ పెళ్ళి కాలేదు. ఇప్పుడు ఏ పేద తండ్రి పుణ్యంపండిందో మరి ! పెళ్ళి కుదిరింది. అందుకే ఈ వెర్రిబాగులోణ్ని చంపేసి, ఆ ఆస్తిమీద కూడ తన అజమాయిషీ సంపాదించుకోవాలని పెద్దకాపు ప్రణాళిక. అది అర్థమైన పానకాలు :

'నా ఒల్లకాదు బాబయ్యా' అనేశాడు.

'సరే ! నీ యిష్టం మరి! లక్షిందేవి నీ ఒళ్ళో వాల్తానంటుంటే చీ చీ... ఒద్దు పొమ్మంటే నేనేం చేస్తాను ? అయినా రొండోర్రోజులు

పైమిస్తన్నా - ఆలోచించుకో ... ఆ తర్వాత బేరమింకోడికిచ్చేసుకుంటా మరి !'

అక్కడేవుంటే ఆశకు లొంగిపోతానేమోనని భయపడ్డాడు పానకాలు. మాట్లాడకుండా వెనక్కి తిరిగి బయల్దేరాడు.

పెద్దకాపుకోసం పానకాలు ఎన్నో హత్యలు చేశాడు. ఎన్నో కొంపలు కూల్చాడు. కాని ఏం లాభం కలిసొచ్చింది ? ఏమీలేదు దరిద్రం రాచపుండులా వాణ్ని కొరుక్కుతింటూనే వుంది. తనుచేసిన ప్రతి పాపం మాత్రం పుణ్యమై పెద్దకాపును మరింత పెద్దవాణ్ని చేస్తోంది.

పానకాలుకు ఆరుగురు ఆడపిల్లలు. అందరూ పరుగుపందెంలో ఎదిగిపోతున్నారు. వయస్సు వరుసగా వాళ్ళమీద అజంతా శిల్పాలు పొదుగుతోంది. వాటిని కప్పుకోడానికి మూరెడు గుడ్డముక్కయినా ఇవ్వలేక పోతున్నాడు. దారినెళ్తుంటే అందరి చూపులూ వాళ్ళమీదే; అంతకు ముందురోజే పెద్ద రబస అయింది. సోడాకొట్టు చింతారావు రెండో పిల్లకి చీర కొనిపెట్టాడు. తల్లి ఒకటే గోల. పానకాలుకే కోపం వచ్చింది. అవును మరి ! కోపం రాదూ ? అసలు వాడికేం పని చీర కొనటానికి ? పెళ్ళి చేసుకుంటావా అనడిగాడు. చేసుకుంటానన్నాడు. కాని అయిదొందలు కట్నం కావాలిట. అసలదికూడ అడిగేవాడు కాదుట. కాని వ్యాపారం పెంచుకోవాలిట. పైగా నీ కూతురే సుఖపడుతుందిగదా అంటాడు. వెనకటికి ఆడపిల్లని కనుక్కున్నవాడికి బంగారం సుద్ద కొనుక్కున్నట్టే వుండేదిట ! ఇదేం పాడుకాలం! అనుకుంటాడు పానకాలు.

పానకాలుకు కడుపులో మంట రేగింది. అప్పుడుగాని తెలీలా

తను తిండి తిని ఎన్నాళ్ళయింటేసు. తనకే ఆకలిగావుంటే చిన్నపిల్ల లింకా ఎంతగా అలమటిస్తున్నారో।

ఇల్లు దగ్గర పడింది. కాని ఇంట్లో గోల వినపడి అడుగులు ముందుకు పడలా. చీకట్లో ఇంటిముందు ఒక మూలగా ఒటిగి కూర్చు న్నాడు. చిన్నపిల్లలు ఆకలికి ఏడుస్తున్నారు.

'ఒసూరుకొండసె। తల్లి సచ్చినపిల్లల్లాగ ఒకటేగోల' కసురు తోంది రెండో కూతురు.

'ఏంటే నీ కళ్ళకావరం? నే చావాలనుందా నీకు' అందు కుంది తల్లి.

'నువ్వింకా బతికున్నా వనుకుంతన్ననేటేంలమ్మా. లేదు. మమ్మల్ని కనేసి నువ్వూ మా అయ్యా ఒప్పుడో సచ్చి పోనారు.'

'చింతాలుగాడి బర్రనొట్టి తిని మా బలిసావే నువ్వూ. మాటలు మా మీరతన్నావు.'

'ఒప్పుడూ ఆడిమీదే నువ్వులేసుకుంటావెందుకే' అని ఎదురు కుంది తల్లిని.

'ఆడు రోజూ ఎందుకిత్తాడే నీకు' అని ఆరాతీసింది తల్లి.

'ఓలమ్మో। మాగొప్ప పెళ్ళేనోలమ్మో।। అమ్మ పెట్టాపెట్ట దంట అడుక్కు తినానియ్యాదంట అట్టాగుంది. అదేగాదేలమ్మ. ఉంకో కొత్త సంగతి సెపుతున్న. అదిగూడ యినుమరి। గుండెలమీద రెండు సేతులూ ఏసుకుని సరీ యిను. నేకపోతే గుండాగి సచ్చిపోగలవ్? రేపు తెల్లారి ఏంజేస్తన్ననో ఎరికా? రాజమండ్రెల్లిపోతన్నా. ఎందు కని అడగవే? అక్కడ మాంచి బేరాల్దొరుకుతాయంట। ఒసేయ్ సెల్లి ముండల్లార। ఇయ్యాల్టికెలాగో నోర్మూసుకుని తొంగోండే—మాపిట్నుంచి మిమ్మల్ని నేనే పెంచుత.'

ఇలా సాగుతోంది లోపలి భాగోతం.

పానకాలుకి తల తిరుగుతోంది. ఈ దరిద్రానికంతికీ కారణం ఏవిటి? ఎందుకు దరిద్రం ఇలా తనమీద దండెత్తుతోంది. దరిద్రం మీద ఎందుకు తిరగబడలేక పోతున్నాడు?

ఒక్కటే ఒక్క కారణం.

అది వాడికి తెల్సు.

ఇంతలో పెద్ద కూతురు మాటలు విన్పించాయి. పానకాలు దృష్టిలో అది చాలా బుద్ధిమంతురాలు. అభిమానవతి!

'రండే కూడు తెచ్చేను రండే' అని పిలుస్తోంది చెల్లెళ్ళని.

ఆ కూడు ఎక్కణ్నుంచి వచ్చిందో అర్థమైంది పానకాలుకు. వాడిలో విచక్షణ ఎగిరిపోయింది. అక్కణ్నుంచి లేచి ఒకటే పరుగు. పావుగంటలో పెద్దకాపు మకాం ముందు వాలాడు.

'బాబో పెద్దకాపుగారో, వొచ్చేశ్న బాబయ్యా .... మీ మాటే కాయమండయ్యా' అన్నాడు వగరుస్తూ.

★